క్లుప్తంగా

వేగంగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బడంగ్‌పేట్: 1వ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ పెద్ద బావి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని టీఎస్‌ఆర్ నగర్ కాలనీలో రూ.13.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతగా, మన్నికతో చేయాలని అధికారులకు, గుత్తేదారులకు కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి బుధవారం యూనిఫాంలను మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పంపిణీ చేశారు. విధినిర్వహణలో తప్పనిసరిగా యూనిఫాంలను ధరించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, ఆర్వో నగేశ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్, బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, ఐలయ్యయాదవ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.


జల్‌పల్లిలో ఇంద్రారెడ్డి జయంతి



ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని సబితా ఇంద్రారెడ్డి కాలనీలో బుధవారం ఇంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకొని పెద్ద ఎత్తున నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ గౌడ్, యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ ఆధ్వర్యంలో జల్‌పల్లి చెరువు కట్ట దిగువన గల ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఇంద్రారెడ్డి చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి కాలనీ అధ్యక్షుడు చంద్రం చారి, వెంకటేశ్ నాయక్, బెలగాం సిద్ధు, వీరేశం గుప్తా, విష్ణువర్ధన్ రెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిలబడి ఆశల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

మహేశ్వరం: కేసీఆర్ ప్రభుత్వం ఆశ కార్యకర్తల పట్ల వివక్ష చూపుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ పేర్కొన్నారు. కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు బుధవారం ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆశలకు ప్రభుత్వం కేవలం పారితోశికం మాత్రమే ఇస్తూ కనీస వేతనం అమలు చేయకుండా శ్రమదోపిడీకి గురిచేస్తోందన్నారు. పది రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు శైలజ, అరుణ, మణెమ్మ, విజయ, కవిత, మంజుల, నిర్మల, సంతోష తదితరులు పాల్గొన్నారు.

పుట్టలమ్మ తల్లికి పూజలు

బడంగ్‌పేట్: పుట్టలమ్మ తల్లి కొలువుదీరిందని భక్తులు పూజలు చేశారు. కొత్తగా నిర్మించిన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో శానిటేషన్ సిబ్బంది పచ్చగడ్డిని శుభ్రం చేస్తుండగా పుట్టలమ్మ అమ్మవారు వెలిశారని గుర్తించి మహిళా శానిటేషన్ సిబ్బంది బుధవారం కొబ్బరికాయలు కొట్టి, నిమ్మకాయలు కోసి, పసుపు కుంకుమ చల్లి పూజలు చేశారు. పుట్టలమ్మ అమ్మవారిని చూడగానే పూనకాలతో అమ్మవారిని చల్లంగా చూడాలని వేడుకున్నారు.

అన్నీ ఒకే చోట..

- ముస్తాబవుతున్న కార్పొరేషన్ భవనం
- ఈ నెల 7న ప్రారంభం
- రూ.8.5 కోట్లతో నిర్మాణం పూర్తి
- ఆకర్షణగా నిలవ నున్న 4లైన్ల రోడ్డు



ముస్తాబ్ అవుతున్న కార్పొరేషన్ భవనం

బడంగ్‌పేట్: ఒకప్పుడు చిన్న గ్రామంగా ఉన్న బడంగ్‌పేట క్రమక్రమంగా తెలంగాణ రాష్ట్రంలోనే టాప్4కు చేరుకుంది. గ్రామ పంచాయతీ వ్యవస్థ నుంచి కార్పొరేషన్ దాక అవతరించింది. మార్కెట్ కల్చర్‌కు నిలయంగా మారింది. అందులో భాగంగానే బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో ఎకరం న్నర విస్తీర్ణంలో విశాలమైన కొత్త కార్పొరేషన్ భవనానికి అంకురార్పణ చేశారు. రెండేళ్ల క్రితం మున్సిపల్, ఐటీ మినిస్టర్ కేటీఆర్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన చేశారు. దీంతో ఈ భవన నిర్మాణానికి రూ.8.5 కోట్లతో రెండంతస్తుల్లో పూర్తి చేశారు. ఈ భవనం ముందు ఉన్న రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా రూ.25 లక్షలు వెచ్చించి తీర్చిదిద్దారు. విశాలమైన గదులను ఏర్పాటుచేసి లప్పం, పాల్‌సీలింగ్, గదులన్నింటిని సుందరంగా తీర్చిదిద్దారు.

7న ప్రారంభం..

విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కోట్లు వెచ్చించి పక్కాభవనం ఏర్పాటునకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 7న మంత్రి కేటీఆర్ ప్రారంభించేలా మంత్రి సబితారెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. భవనం ముందు రంగులు వేయించే పనిలో కార్పొరేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు వేగంగా చేయిస్తున్నారు. ఇప్పటికే దావుత్‌ఖాన్‌గూడలో మున్సిపల్ కార్పొరేషన్ భవనంతో పాటు జిల్లా గ్రంథాలయం, మోడరన్ హైస్కూల్, పక్కనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కార్పొరేషన్ భవనం ఎదురుగా ప్రజాభవన్, వీటి ఎదురుగానే పాల్‌టెక్నిక్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, ఇలా అన్ని ఒకే చోట కేంద్రీకృతం అయ్యేలా మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతీసుకున్నారు..



ప్రభుత్వానికి చెందిన అన్ని భవనాలు ఈ డివిజన్‌లో ఏర్పాటు చేస్తుండటం ఆనందంగా ఉంది. ప్రజలకు కావలసిన ప్రభుత్వ సేవలు ఇక్కడే లభించేలా మంత్రి సబితారెడ్డి చొరవతీసుకున్నారు. భవన నిర్మాణానికి సహకారం అందించిన మంత్రి సబితారెడ్డికి, కార్పొరేషన్ పాలకవర్గం సభ్యులకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్, 28వ డివిజన్

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీల్లో, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనులు చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్‌లోని 5, 9, 16 డివిజన్లలో రూ. 2.39కోట్లతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీర్‌పేట ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనతో పాటు గొలుసు కట్టు చెరువులను సుందరీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇప్పటికే చందన చెరువు, మంత్రాల చెరువును అభివృద్ధి చేశామని, పెద్ద చెరువు సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు ఎనుగుల అనిల్‌యాదవ్, పెండ్యాల శివపార్వతి, కమిషనర్ అల్లూరి వాణి, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో అలసత్వం తగదు



డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చల్లా నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి

కందుకూరు: రైతులకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయడంలో బ్యాంకులు అలసత్వం వహిస్తున్నాయని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి విమర్శించారు. రైతు రుణమాఫీ నిధులను వెంటనే విడుదల చేసేలా బ్యాంకులు చొరవ చూపాలని కోరుతూ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్‌లు వ్యవసాయ శాఖ డిప్యూటీ కమిషనర్, లీడ్ బ్యాంక్ జనరల్ మేనేజర్, కెనరా బ్యాంక్ డివిజనల్ జీఎంలకు బుధవారం వినతి పత్రాలు అందజేశారు. కందుకూరు మండల పరిధిలోని నేదునూరు, లేమూరు, రాచులూరు, గుమ్మడవెల్లిలోని కెనరా బ్యాంకు శాఖల పరిధిలో రైతులకు రుణ మాఫీ కాలేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ రైతులందరికి అందేలా రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సెక్రటరీ ఎల్మటి అమరేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేశ్‌నాయక్, సీనియర్ నాయకులు బుక్క పాండురంగారెడ్డి, ధనరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

దళిత బంధు మంజూరు చేయాలి



ధర్నా చేస్తున్న దళితులు, సీపీఎం నాయికులు

కందుకూరు: దళితులందరికీ దళిత బంధు పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. గ్రామానికి పది నుంచి ఇరవై మందికే దళిత బంధు ఇస్తున్నారని, అదికూడా అధికార పార్టీకి చెందిన వారికే ఇవ్వడం ఎంటని వారు ప్రశ్నించారు. ఆర్థికంగా బలంగా ఉన్న వారికే మంజూరు చేయడం బాధాకరమన్నారు. దళితుల మధ్య బీఆర్‌ఎస్ ప్రభుత్వం అగాథం సృష్టిస్తుందన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా అధికారులే గ్రామ సభలు ఏర్పాటు చేసి నిరుపేద కుటుంబాలను గురించి వారికే మొదట దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.చందు, ఎ.కుమార్, ఎన్.నరసింహా, ఆర్.శేఖర్, గాదె కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు



జంగారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయికులు

కందుకూరు: కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనతో కేక్ కట్ చేయించి శాలువా కప్పి సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

చైతన్యపురి: డిగ్రీ, బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ, పీజీ చదివిన నిరుద్యోగ యువతకు వెబ్ డెవలపర్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని నిర్మాణ్ ఆర్గనైజేషన్ మేనేజర్ ఇమ్రాన్ హాసన్ తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు.ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8008088392 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎల్‌బీనగర్ ఓటర్ల తుది జాబితా విడుదల

ఎల్‌బీనగర్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎల్‌బీనగర్ నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి బుధవారం విడుదల చేశారు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు 566814 మంది ఓటర్లు ఉండగా పురుషులు, 296017, మహిళలు, 270696, ఇతరులు 101మంది ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 235 ప్రాంతాలు 570 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

దివ్యాంగుడికి చక్రాల కుర్చీ అందజేత

వనస్థలిపురం: శ్రీ సద్గురు భం అన్వరానంద బాబా వనస్థలిపురం సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురం శ్రీలక్ష్మీగణపతి దేవాలయం వద్ద ఓ వృద్ధ దివ్యాంగుడికి చక్రాల కుర్చీని సమితి ప్రతినిధులు సంజీవ రెడ్డి, బద్ధం వినోద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాయుడు, శ్రీరామ్ అందజేశారు.

గడప గడపకు బీజేపీ

పహాడీషరీఫ్‌లో ఛాయ్ పే చర్చ



ఛాయ్ పే చర్చలో శ్రీరాములు యాదవ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని పహాడీషరీఫ్ గ్రామంలో గడప గడపకు బీజేపీలోభాగంగా నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ బుధవారం ఛాయ్ పే చర్చలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ చీకటి బాగోతాన్ని స్వయంగా ప్రధాని మోడినే బయటపెట్టారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేశ్ యాదవ్, లడ్డూ, సుధాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించండి



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ టెక్నాలజీ ఇన్‌చార్జి రాజ్‌కుమార్

మహేశ్వరం: క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తయారు చేయడమే లక్ష్యమని ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ టెక్నాలజీ ఇన్‌చార్జి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరం మండల కేంద్రంలోని సుధీర్‌రెడ్డి గ్రాండ్ ఏరీనా క్రికెట్ గ్రౌండ్‌లో న్యూజిల్యాండ్ హట్‌హక్స్ వర్సెస్ ఎంఎస్‌కే ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ జట్ల మధ్య పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో నైపుణ్యం కలిగిన కోచ్‌లతో శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ స్థాయిలో ఆడేవిధంగా తయారు చేస్తామన్నారు. క్రీడాకారులకు మెలకువలు నేర్పించి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేయించి ఆడిస్తామన్నారు. న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియాలలో ఉన్న వివిధ క్రికెట్ క్లబ్‌లు, అకాడమీలతో ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ భాగస్వామ్యంతో ఆయా టోర్నీలలో ఎంపికచేసి ఆడిస్తామన్నారు. న్యూజిల్యాండ్ నుంచి అండర్ 14, 16, 19 విభాగాల్లో క్రీడాకారులు హైదరాబాద్ మహేశ్వరంలో ఆడడం అభినందనీయమన్నారు. అంతకు ముందు న్యూజిల్యాండ్ దేశానికి చెందిన హట్‌హక్స్ క్రికెట్ క్లబ్ వర్సెస్ ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రాండ్ ఏరీనా స్పోర్ట్స్ కౌంటీ డైరెక్టర్ వంగా అరుణసుధీర్‌రెడ్డి, ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ జనరల్ మేనేజర్ మనోజ్ సాయి, గ్రాండ్ ఏరీనా స్పోర్ట్స్ కౌంటీ మేనేజర్ టీకే.అశ్విన్, న్యూజిల్యాండ్, ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను పునరుద్ధరించండి



బీసీ హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఆచారి

బీజేపీ సీనియర్ నేత ఆచారి

ఆమనగల్లు: ఆమనగల్లులో ఎత్తివేసిన బీసీ హాస్టల్‌ను వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి ప్రభుత్వాన్ని కోరారు. బీసీ హాస్టల్ భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆమనగల్లు పట్టణంలో విద్యార్థులు లేరన్న సాకుతో రెండేళ్ల క్రితం బీసీ హాస్టల్‌ను ఎత్తివేసి హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు తరలించారన్నారు. అప్పటినుంచి ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుందన్నారు. హాస్టల్ లేకపోవడంతో స్థానిక బీసీ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో నూతన భవనం నిర్మించి బీసీ హాస్టల్‌ను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా మాటలతో కాలం గడుపుతున్నారని ఆచారి విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నాయకులు పాషా, శ్రీధర్, కిరణ్, శ్రీను తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మహాలక్ష్మినగర్‌లో పర్యటిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీ నగర్, సాయిరామ్‌కాలనీలలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో మంచినీటి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాకేశ్, మడుపు సందీప్‌రెడ్డి, యాదయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కోటేశ్వరరావు,చౌదరి, గిరిధర్, గౌస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

హస్తినాపురం: అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించిన అనంతరం సీఐ జలేందర్‌రెడ్డి విద్యార్థులకు గణితాన్ని బోధించి అబ్బురపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు వినయంతో క్రమశిక్షణతో మెలిగినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు.

రైతుబజార్ పరిసరాల్లో కూరగాయలు అమ్మొద్దు



రైతు బజార్ ఎస్టేట్ అధికారి స్రవంతిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్ నగర్ రైతు బజార్ ముందు రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి పారమిత చిల్డ్రన్స్ హాస్పిటల్ వరకు నేషనల్ హైవేపై ఆటోలో కూరగాయలు తీసుకువచ్చి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే రైతులు ఎస్టేట్ అధికారిని స్రవంతి రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సరూర్‌నగర్ రైతు బజార్ ప్రారంభమైనప్పటి నుండి ఇబ్రహీంపట్నం, యాచారం, ఆరుట్ల, జాపాల, చౌదర్పల్లి తదితర గ్రామాల 40–50 కిలోమీటర్ల దూరం నుండి కూరగాయలు తీసుకువచ్చి అమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నామన్నారు. రైతు బజార్ పరిధిలో రెండు మూడు కిలోమీటర్ల దూరం వరకు ఎలాంటి కూరగాయల అమ్మకూడదని ఉందని అన్నారు. రోడ్డుపై ఆటోలో కూరగాయల విక్రయించడం వల్ల రైతు బజార్లో అమ్మకాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తెచ్చిన కూరగాయలు అమ్ముడు పోక సాయంత్రం సమయంలో పారబోసి ఇంటికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సాయంత్రం రోడ్డుపై ఆటోల విక్రయించడం వల్ల పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతుందని అన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: కార్మికులకు ఆర్థికసాయం అందజేస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె శిబిరాలను బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎం కంటే ఎక్కువ పనిచేస్తున్న ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు, ప్రమాదబీమా రూ.5లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. కాంగ్రెస్ నాయకులు గౌస్‌పాషా, కమలాకర్ రెడ్డి, శ్రీకాంత్, యాదగిరి, గోపాల్, రవికుమార్, రాజు, శ్రీధర్‌రెడ్డి, నాని పాల్గొన్నారు.

పెంచిన జీతాలు ఇవ్వాలి

ఆమనగల్లు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారంతో 7వ రోజుకు చేరుకుంది. జీఓ నం.8 ప్రకారం కార్మికులకు పెంచిన జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శంకరమ్మ, ఈశ్వరమ్మ, సుగుణమ్మ, ఆశమ్మ, రాములమ్మ, అలివేలు, గిరిజ, పెంటమ్మ, అనంత, సఫియాబేగం, బేబి, శాంతమ్మ, యాదమ్మ, ఎల్లమ్మ, లలిత, ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల భిక్షాటన..



ఆమనగల్లు: భిక్షాటన చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆశ కార్యకర్తలు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. బుధవారం పట్టణంలో ఆశ కార్యకర్తలు భిక్షాటన నిర్వహించారు. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు బీబీ సల్మ, నిర్మల, వసంత, ఈశ్వరమ్మ, లక్ష్మమ్మ, అనిత, మంజుల, చంద్రకళ, వరమ్మ, అనిత, శమంత తదితరులు పాల్గొన్నారు.